# సమత్వమును బోధించటమే దివ్యత్వముయొక్క ప్రధాన లక్ష్యము

ప్రేమ దైవంబు జగమెల్ల ప్రేమమయము
ప్రేమరూపము గొనివచ్చి పేర్మిమీర
ప్రేమసుధలను చిందించి ప్రేమగూర్చు
ప్రేమ అవతార! శ్రీకృష్ణ ప్రేమ తృష్ణ

పూర్ణ ప్రేమయందె పుట్టును సౌఖ్యంబు
సత్య త్యాగ శాంతి క్షాంతులబ్బు
ప్రేమ లేకయున్న క్షేమంబు లేదయా!
సత్యమైన బాట ఈ సాయి మాట.

ప్రేమ స్వరూపులారా!

అనురాగము, ప్రేమలు రెండును అన్యోన్యాశ్రయములై, అవినాభావ సంబంధము గలిగి ఒక్కటిగ నిరూపింపబడుచున్నవి. మనసును భౌతికమైన జగత్తువైపు మరల్చినప్పుడు దీనిని 'అనురాగమ'నియు, ఈ మనసునే దైవముపైన మరల్చినప్పుడు 'ప్రేమ'యనియు పిలువబడుచున్నది. ప్రేమకు ప్రేమయే ఫలం. ప్రేమకు ప్రేమయే సాటి. ప్రేమ ప్రేమను మాత్రమే అందించగలదు. ఇట్టి పవిత్రమైన ప్రేమను పోల్చుటకు మరొక పదార్థము ఈ జగత్తున లేదు.

ప్రేమను కవిత్వమునందు వర్ణించుటకు వీలు గాదు. ప్రేమను మనసు లేక వాక్కుతో

srisathyasaivachanamrutam

నిరూపించుటకు సాధ్యము గాదు. కనుకనే వేదం దీనిని "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ"- వాక్కునకుగాని, మనసుకుగాని దీనిని వర్ణించుటకు వీలుగాదని వెల్లడించినది. ఈ ప్రేమయొక్క విలువ యిట్టిది అట్టిది యని; ఇంత, అంతయని చెప్పుటకు సాధ్యము కాదు. దీని రుచి ఇట్టిది అట్టిదియని నిరూపించుటకు సాధ్యము కాదు.

**ప్రేమరత్నమును ప్రేమద్వారానే పొందడానికి సాధ్యమవుతుంది**

శాస్త్రములు, వేదములు అమృతాన్ని అనంతమని, అమరమని, అతి మధురమని వర్ణిస్తూ వచ్చాయి. కాని ఆ అమృతము ప్రేమయొక్క రుచిముందు చప్పగా ఉంటుంది. ఈ ప్రేమ చాల విలువైన వజ్రము. ఇది అన్ని ప్రదేశములయందు, అంతట చిక్కేది గాదు. ప్రేమ సామ్రాజ్యమందు, ప్రేమ వీధిలో, ప్రేమ అంగడియందు మాత్రమే ఈ వజ్రము లభ్యమవుతుంది. ప్రేమ సామ్రాజ్యమనగా హృదయ సామ్రాజ్యమే! హృదయం ప్రేమమయమైనప్పుడే యిది హృదయ సామ్రాజ్యంగా రూపొందుతుంది. మనస్సనే ప్రేమ వీధిలో (అనగా మనస్సు ప్రేమమయమయినప్పుడే) ఈ రత్నము లభ్యమవుతుంది. ఈ విధముగా ప్రేమమయమయిన హృదయము, మనస్సుండినప్పుడే ఈ రత్నము లభ్యమౌతుంది.

ఇట్టి వజ్రమును కొనవలెనన్న జపము, ధ్యానములనే సత్కర్మచేకాని, యజ్ఞ యాగాదులచేగాని, చింతన, భజనలనే క్రియలతో గాని దీనిని కొనలేరు. యజ్ఞయాగాది క్రతువులు, దాన ధర్మాదులు, చింతన, భజనాదులు ఇవన్నీ మానసిక తృప్తిని మాత్రమే చేకూర్చును. వీటివల్ల ప్రేమ అనే మణిని పొందలేము. ఈ ప్రేమమణిని ప్రేమ ద్వారానే పొందడానికి సాధ్యమవుతుంది.

శాంతి మార్గము, సఖ్య మార్గము, వాత్సల్య మార్గము, అనురాగ మార్గము, మధుర మార్గము మొదలైన ఆరు విధములన్నీ ప్రేమ మార్గమునందే యిమిడియున్నవి. సమస్త సాధనల సారమంతా ఈ ప్రేమ మార్గమునందే సమ్మిళితమైయున్నది. మనం భగవంతుని ఎంత అధికంగా ప్రేమిస్తామో, అంత ఆనందం మన మనస్సునందు ఆవిర్భవిస్తుంది. ప్రేమ తరిగినకొలది మానవునియందు ఆనందం క్షీణిస్తుంది.

**భగవంతుని ప్రేమించినవానికి సర్వత్ర భగవంతుడే కనిపిస్తుంటాడు**

sri sathyasai vachanamrutam

పిచ్చి కుక్క కరిచినటువంటివాడికి ఎక్కడ చూచినా కుక్కలే కనిపిస్తుంటాయని లోకములో వాడుక. అదే విధంగానే భగవంతుని ప్రేమించినవాడికి సర్వత్రా భగవంతుడే కనిపిస్తుంటాడు. కనుక మానవుని మనసు, హృదయము ప్రేమమయం కావాలి. స్వార్థాహంకారాలు కలిగిన హృదయాలలో ప్రేమ ప్రవేశించదు.

తనను తాను మరచి, తన తత్త్వాన్ని మరచి భగవంతుని ప్రేమించాలి. ప్రేమ భగవంతుని తన్మయుణ్ణి గావిస్తుంది, భక్తుణ్ణి ఉన్మత్తుణ్ణి గావిస్తుంది. ప్రేమ తనకు తానే మత్తుగా మారిపోతుంది. ప్రేమ భగవంతుని, భక్తుని తాండవమాడించి తానుకూడను తాండవమాడుతుంది. తనను తాను మరిపిస్తుంది. తనను తాను మరిపిస్తుంది. మైమరచి ఆనందాన్ని అనుభవిస్తుంది. ప్రేమ యెడబాటును సహింపదు. ఇట్టి ప్రేమను మానవులయందు చాటే నిమిత్తము మానవులమధ్య మానవాకారమును ధరించి గోలోకమునుండి భూలోకానికి దిగివచ్చినటువంటి దినమే ఈనాటి దినము.

మానవాకారమును ధరించి మానవునికి మానవునికి మధ్య ఇట్టి ప్రేమను బోధించినప్పుడే దివ్యతత్త్వము మానవునికి అర్థమవుతుంది. పూర్వ కాలమునందు మహర్షులు కఠినమైన కారడవులయందు క్రూరమృగములున్న స్థానమునందు తపస్సులాచరిస్తూ వచ్చారు. వారి దగ్గర యెట్టి ఆయుధములు లేవు. వారిని వారు ప్రేమతోనే రక్షించుకొన్నారు.

వారు భగవంతుని ప్రేమించి, భగవంతుని విశ్వసించి కఠినమైన క్రూర మృగములమధ్య జీవిస్తుండడానికి కారణమేమిటి? వారు తమ ప్రేమను మానవులవరకు మాత్రమే పరిమితము చేయకుండ సమస్త జీవరాసులపైన ప్రసరింపజేసారు. అటువంటి విశాల హృదయంతో తపస్సు నాచరిస్తూ వచ్చారు. కనుకనే వారి ప్రేమ క్రూర మృగములయిన పులులు, చిరుతలయందుకూడ ప్రవేశించి, ఆ ప్రేమచేత మృగములు, ఋషు లిరువురుకూడ కలసి మెలసి ఒకే అరణ్యంలో జీవిస్తూ వచ్చారు. ప్రేమ క్రూరమృగములైన పులులనుకూడ ప్రేమమయం గావించింది.

**మానవునిలోని పశుత్వాన్ని ప్రేమాస్త్రంతో నాశనం చేసి, మానవత్వాన్ని దివ్యత్వంగా రూపొందించుకోవచ్చు**

ఈనాటి మానవుడు ప్రేమ కోల్పోవడంచేత, స్వార్థ స్వప్రయోజనములనే దుర్గుణాలు

sri sathyasai vachanamrutam

తనలో ప్రవేశించడంచేత తానుకూడ పులిగా మారిపోతున్నాడు. మీరు నిత్యము పేపర్‌లో చూస్తుంటారు. నాలుగు పులులు శ్రీలంకలో చచ్చాయి అని వ్రాస్తుంటారు. ఈ పులులంటే యెవరు? మనుషులే పులులుగా మారిపోయారు. ఆనాటి పులులు మానవులుగా మారిన ఈనాటి మానవులు మాత్రం పులులుగా మారిపోతున్నారు. కనుక మానవునిలోని పశుత్వాన్ని ప్రేమ అనే అస్త్రంతో నాశనం చేసి మానవత్వాన్ని, దివ్యత్వంగా రూపొందించుకోవచ్చు. ఆనాటి మానవుల మనస్సు విశాలమైనటువంటిది, సరళమైనది. ఈ ప్రేమచేతనే మనసింత సరళమైనప్పటికిని, అప్పుడప్పుడు దీని ప్రభావంచేతనే మానవుని మనసు కఠినంగాకూడ మారిపోతున్నది. ఏ విధంగా అంటే ప్రేమచేతనే కొన్ని పదములు కఠినంగా ఉపయోగపెట్టవలసియుంటుంది. కఠినమైన శిక్షనుకూడ విధించవలసి యుంటుంది. ఈ శిక్ష గాని, ఈ కఠిన పదములుగాని ప్రేమతో కూడినవే! వర్షం కురిస్తే అంతా జలమయమే కదా! వర్షము, వడగండ్లు జలమయములే! అదే కఠిన పదములుకాని, కఠిన శిక్షగాని యివి రెండుకూడ ప్రేమతో కూడినటువంటివే! ఒక్కొక్క సమయంలో భక్తులుకూడ తాము అమితంగా ప్రేమించినవారిపై కొన్ని కఠినమైన పదములు ఉపయోగపెడుతుంటారు.

**బలరామ, కృష్ణుల జన్మమే దుష్టసంహారముకొరకు వచ్చినది**

బలరామ, కృష్ణులు బలమైనవారని తన ప్రాణములు తీయు యముళ్ళని గుర్తించి, వారినేరకంగానైన కడతేర్చాలని అనేక పన్నాగములు కంసుడు పన్నినప్పటికిని, బలరామ కృష్ణులు అతనికి చిక్కలేదు. ఏదో ఒక యాగము అనే నెపం పెట్టి, అక్రూరుని పంపి బలరామ, కృష్ణులను తీసుకొని రమ్మని ఆజ్ఞాపించాడు. అక్రూరుడు చాల సరళ హృదయుడు, పరమ భక్తుడు. అతనికి బలరామ, కృష్ణులను తీసికొనిపోవడము ఇష్టము లేకపోయినప్పటికి తన ప్రభువాజ్ఞను పాటించక తప్పదు. అందువల్ల అక్రూరుడు వ్రేపల్లెను జేరి, ఈ వార్తను నంద, యశోదలకు తెలిపి తనవెంట తీసికొని పోవుటకు తగిన యేర్పాట్లు చేసాడు. ఈ వార్త గోపికలకు తెలిసింది. అందరు యశోద యింటిముందు చేరి 'ఈ వచ్చిన క్రూరుడెవరు?' అన్నారు. 'ఇతడక్రూరుడు కాదు, క్రూరుడు. ఈ క్రూరుని చేతులలో మా బలరామ కృష్ణులను పెట్టటమా? కానీ ఇతనితో మనకేం పని? బలరామ కృష్ణులను ఒప్పించి, ఇతనితో వెళ్లకుండ చేయాల'ని

వారు అనేక రీతుల కృషి సల్పారు. అయితే బలరామ, కృష్ణుల జన్మమే దుష్టులను సంహరించుట కొరకు కనుక, తాము వచ్చిన పని కొనసాగాలి. కనుక, వారు ఈ గోపికల ప్రార్థనను మన్నించకుండ రథమెక్కారు. గోపికలందరు ఆ రథాన్ని చుట్టుముట్టి ముందుకు పోకుండ చేసారు. 'ఇంక మా ప్రార్థనలేవీ శ్రీకృష్ణుని చెవిన పడవు. కనుక వినయ విధేయతలతో, ప్రేమతో వారిని ప్రార్థించాల'ని నిర్ణయం చేసుకొని, గుఱ్ఱములు కదలకుండ చుట్టూ చేరారు.

**కరుణింపుము స్వామీ! నెమ్మదించవదేమి?**
**నిలువలేము నిను విడిచి నిమిషము స్వామీ!**
**ఏల యిటుల చేతువు మమ్మిలా యిది మేలా?**
**కరుణింపుము స్వామీ! నెమ్మదించవదేమి?**
**ఏమిటా మహా యాగము, కంసుని దుర్యోగము**
**ఒక్కటే మా ప్రార్థన, ఒక్కటే మా ప్రార్థన**
**నమ్మినట్టి మమ్ముకూడ రమ్మనవేమి?**
**స్వామీ! స్వామీ! స్వామీ!**
**కరుణింపుము స్వామీ! నెమ్మదించవదేమి?**

అని ప్రార్థించారు. వీళ్లు ప్రార్థిస్తుండగానే కృష్ణమాయచేత ఆ రథం ఎవరికి కనిపించకుండ వెళ్ళిపోయింది.

**గోపికల హృదయం పరిపూర్ణ ప్రేమమయం**

గోపికల హృదయం పరిపూర్ణ ప్రేమమయం. ఇది వృక్షమా? ఇది పొదయా? ఇది పుష్పమా? ఇవి మాటాడగలవా? వీటికి కన్నులున్నవా? అనే విచక్షణా జ్ఞానమే లేదు. వారి హృదయం ప్రేమమయం కావటంచేత సర్వము ప్రేమగానే కనిపిస్తున్నది. అన్నిటిని సజీవమైనవిగానే భావిస్తూ వారు పరుగెత్తుతున్నారు. చెట్టు చెట్టు దగ్గరికి, పుష్పముల దగ్గరకంతా వెళ్ళి అడుగుతున్నారు.

**నల్లనివాడు పద్మ నయనమ్ములవాడు కృపారసంబు పై**
**జల్లెడివాడు మౌళి పరిసర్పిత పింఛమువాడు నవ్వు రా**

sri sathyasaivachanamrutam

**జిల్లెడి మోమువాడొకడు చెల్వల మానధనంబు దోచె నో**
**మల్లియలార! మీ పొదల మాటున లేడు గదమ్మ! చెప్పరే!**

భగవంతునియందు తన్మయులైనవారికి సర్వము సజీవ రూపాలుగా కన్పిస్తాయి. ప్రేమయొక్క తత్త్వము ఇంత మహత్తరమైనటువంటిది. ఈ ప్రేమనే అనేకులు అనేక రకాలుగా ఉపయోగిస్తున్నారు.

పరమ భక్తురాండ్రైన గోపికలు తమ ప్రాణమే కృష్ణుడిగా భావించి ప్రార్థిస్తూ, తమ సర్వస్వము అతడేనని విశ్వసిస్తూ వచ్చారు. అదే మాతృదేవి అయినటువంటి యశోద కృష్ణుని తన కుమారునిగా విశ్వసించింది. రెండు దినములు చూచింది. మధురనుండి ఏ వార్తలు రాలేదు. గోపికలకుండినటువంటి ప్రేమ తత్త్వము, యశోద కుండినటువంటి వాత్సల్య తత్త్వమునకు మధ్యగల వ్యత్యాసాన్ని ఇక్కడ గుర్తించడం అత్యవసరం. ఈ యశోద ఏ విధంగా కృష్ణుణ్ణి భావిస్తున్నది? సామాన్యమైనటువంటి బాలునిగా, తన ముద్దుల పట్టిగా , పసికందుగా భావిస్తున్నది.

**నర రాక్షసులు చేరి పుర వీధులను తరుమ**
**బాధలెన్ని పడిరో బలరామ కృష్ణులు**
**పసి కందులగు మీపై కంస భూపాలుడు**
**మద గజంబును వదల మనసెట్టు లొప్పెనో**
**కన్ననాటినుండి కడగండ్ల పాల్జేసి**
**కంటితో జూచు నా కర్మమేమో కృష్ణా!**
**మాతృదేవి మనసు మరచితివా తండ్రీ!**
**మధురకే చేరితివా! మమతనే మరచితివా?**
**ఇదిగదిగొ వత్తువని ఇందాక జూచితిని**
**నిలువలేనుర నేను నిమిషమిక! కృష్ణా!**

అంటూ వాపోయింది. భక్తుల భావమునకు, ఈ మాతృమూర్తి భావమునకు చాల వ్యత్యాసముంటుంది. శరీర సంబంధమును పురస్కరించుకొని తల్లి వాత్సల్యముతో ఈ విధంగా

srisathyasaivachanamrutam

పలుకుతుంటుంది. కాని భక్తులు ఆవిధంగా కాదు.

**"మురళి గాన విలోల గోపాల బాల**
**మోము చూపవదేల? గోపికా లోల"**

అంటుంటారు. పరిపూర్ణ ప్రేమతో తన్మయురాలైన రాధ ప్రేమ మరొక రీతిగా ఉంటుంది. 'కృష్ణా! నీవే రూపము ధరించినా, ఏ ప్రదేశమునందుండినా నేను నీలో ఐక్యమైయుండునటువంటి రీతిగా నన్ను అనుగ్రహించుమ'ని కోరింది.

**వృక్షంబువై నీవు వర్థిల్లుచుండిన**
**వల్లికనై నేను అల్లుకొందు**
**పుష్పంబువై నీవు పొలుపొందుచుండిన**
**తుమ్మెదనై నేను తిరుగుచుందు**
**అనంతమైనట్టి ఆకాశమీవైన**
**చిన్ని చుక్కగ నీలోన చెలగుచుందు**
**వర సముద్రుడే నీవైయుండిన**
**వాహినియై నేను ఐక్యమగుదు**
**మేరుపర్వత భవ్యమేదిని నీవైన**
**సెలయేటినై నేను చెలగుచుందు.**

ఈ విధమైన ఏకత్వాన్ని విశ్వసిస్తూ వచ్చింది రాధ.

**ప్రేమకు పేర్లు వేరువేరుగా ఉండవచ్చునుగాని, ప్రేమానుభూతి అందరియందు ఒక్కటే!**

అందరియందు ఒకే ప్రేమ తత్త్వమున్నది. ప్రేమకు అనేక పేర్లు మాత్రమే కాని ప్రేమానుభూతి అందరియందు ఒక్కటే!

**ప్రేమ రూపంబు బ్రహ్మంబు ప్రేమ మయము**
**ప్రేమ ప్రేమతో సంధింప నీమమగును**
**కాన ప్రేమను గట్టిగా గలిగియున్న**

sri sathyasai vachanamrutam

**అద్వితీయము నొందంగ నర్హుడగును.**

ప్రేమ అనే పదము చాల చిన్నది. ఇది కేవలము రెండు అక్షరములతో కూడినటువంటిది. రెండక్షరములతో కూడిన ఈ ప్రేమయందు అక్షయ జగత్తంతా యిమిడియున్నది. దురదృష్టవశాత్తు ఈనాడు ఎవరూ అట్టి ప్రేమ తత్త్వాన్ని చక్కగా గుర్తించుటకు ప్రయత్నించడం లేదు. తమ తమ సంకుచితమైన ప్రేమలను పోల్చుకొని, దివ్యమైన, అనంతమైన, అమరమైన ఈ ప్రేమ తత్త్వాన్ని కించపరుస్తున్నారు.

ప్రేమ అమరత్వముతో కూడినటువంటిది. అమృతమయమైనది. అనంతమైనది. దీనిని మరొక దానితో పోల్చుటకు ఎవరికీ సాధ్యము కాదు. దీనిని పోలునట్టి పదార్థముకూడ జగత్తులో మరొకటి లేదు. కనుక, ఈ ప్రేమ తత్త్వాన్ని ప్రపంచమునందు మానవునకు నేర్పే నిమిత్తమై ఈ ప్రేమయే మానవాకారము ధరించి వస్తుంటుంది. ధర్మము, న్యాయము, సత్య మార్గమున మానవుని ప్రవేశపెట్టే నిమిత్తము భగవంతుడు అవతరిస్తున్నాడని అనేక గ్రంథములు బోధిస్తున్నాయి. భగవద్గీతలోకూడా "ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అని చెప్పబడింది. సర్వ ధర్మములు, సర్వ న్యాయములు, మరియు సత్యము ఒక్క ప్రేమయందే మిళితమై యున్నాయి. ప్రేమయే లేక యెంత ధర్మమున్నప్పటికిని అది కృత్రిమ ధర్మంగా రూపొందుతుంది. ప్రేమలేని ధర్మమెట్టి ధర్మము? ప్రేమలేని న్యాయమెట్టి న్యాయము? ఇది కేవలము ప్రాణము లేని జీవితమువంటిది. ప్రేమయే ప్రాణము. ప్రేమలేని మానవుడు జగత్తులో క్షణమైనా నిలవడానికి వీలుగాదు. ఆ ప్రేమ స్వరూపమే పరమాత్మ స్వరూపము. అట్టి ప్రేమ తత్త్వాన్ని బోధించే నిమిత్తం కృష్ణావతారము మొదలైన అవతారాలన్నీ ఏర్పడినవి. ఆయా దేశ కాల పరిస్థితుల ప్రభావమును పురస్కరించుకొని ఆయా స్వరూపాలకు భిన్నభిన్నమైన పేరులు పెట్టి ప్రజలు అవతార తత్త్వమును అనుభవించారు.

**సాధనామార్గములు ఎన్ని ఉన్నప్పటికి, ప్రేమమయము కాకుండిన అవన్నీ వ్యర్థమే!**

చక్కెరతో చేసిన పాకమును ఒకటి నెమలిగా, ఒకటి పక్షిగా, ఒక్కటి కుక్కగా, ఒకటి నక్కగా అచ్చు పోసి పిల్లల కమ్ముతుంటారు. ఇవన్నీ చేయడానికి కారణం యేమిటి? పిల్లలయొక్క అభిరుచిని పురస్కరించుకొని ఒకరికి కుక్క, మరొకరికి నక్క, ఇంకొకరికి పులి, తక్కిన వారికి

srisathyasaivachanamrutam

పక్షి, హంస మొదలైన రూపాలతో వారి వారికి అందజేస్తుంటారు. అదే రీతిగా కృతయుగమున ధ్యానము, త్రేతా యుగమున యజ్ఞము, ద్వాపర యుగమున అర్చనము, కలియుగమున నామ స్మరణము ఈ నాల్గు యుగములకు కాల మాన పరిస్థితులను పురస్కరించుకొని ఆయా సాధనలను ప్రబోధించడానికి అవతారములు వస్తుంటాయి. అయితే ఈ సాధనలు అన్నింటియందు ఒకే ప్రేమ ఉంటున్నది. అదే విధంగా నవవిధ భక్తులయందుకూడ ఉన్నది ప్రేమ ఒక్కటే! శ్రవణం, కీర్తనం, విష్ణు స్మరణం, పాద సేవనం, వందనం, అర్చనం, దాస్యం, స్నేహం, ఆత్మ నివేదనం అనేవి నవవిధ భక్తి మార్గాలు. ఈ నవవిధ మార్గాలయందు నవవిధ రుచులతో, నవవిధ మాధుర్యాలతో ఉండినటువంటిది దైవనామం ఒక్కటే! కనుక, మానవులకు ఎన్ని సాధనా మార్గములున్నప్పటికి ప్రేమమయము కాకుండిన అవన్నీ కేవలం వ్యర్థము. కనుక, ఎట్టి పరిస్థితులయందుకూడ ఈ ప్రేమ తత్త్వములో మార్పు లేకుండ చూసుకోవాలి.

పాండవాగ్రజుడైన ధర్మరాజు విశ్వాసమిట్టిదే! కారడవులలో జీవించినప్పుడు, రారాజుగా పాలించినప్పుడు, ద్రౌపదిని పరాభవించినప్పుడు, అభిమన్యుని ప్రాణము తీసినప్పుడు, ఉప పాండవుల గొంతు కోసినప్పుడు అన్ని పరిస్థితులయందును మతిని ఒకే రీతిగా గట్టిగా పెట్టుకున్నాడు. కృష్ణుడు తప్ప అన్యులెవ్వరు తన్ను రక్షించువారు లేరని, అన్ని సమయములందును కృష్ణ నామ చింతన తప్ప, అన్య చింత చేయలేదు. సామాన్య వ్యక్తిలాగ పొంగిపోవటంగాని, జూదములో ఓడి పోయితినని క్రుంగుటకాని ధర్మజునియందు కానరాలేదు. అట్టి చలించని మనసును, భ్రమించని దృష్టిని కలిగియుండడమే పాండవుల సాధనా లక్ష్యము. కలి ప్రభావంచేత కష్టములు, దుఃఖములు, నష్టములు సంభవించినప్పుడు భగవంతుని దూషించుట, సుఖములు, ఆనందములు, ఆరోగ్యము కలిగినప్పుడు భగవంతుని వర్ణించుట ఇది ఈనాడు సామాన్య మానవుని లక్షణమైపోయింది. ఇది సరికాదు. సుఖ, దుఃఖములలో సమత్వాన్ని కలిగి, ప్రేమ తత్త్వాన్ని పొందాలి. 'సర్వులందున్నటువంటి సర్వేశ్వరుడొక్కడే!' యని విశ్వసించాలి.

దీనికొక చక్కని ఉపమానము. మనకు దేహమున్నది కదా! ఈ దేహములో అనేక అంగములున్నవి. ఏ అంగమునకు కష్టము కలిగినప్పటికిని, దేహమంతా బాధపడుతున్నది. పన్ను నొప్పి వస్తే, అది తనకంటె వేరు కాదని పన్ను నొప్పిని తానే అనుభవిస్తున్నది. అట్లే



sri sathyasai vachanamrutam

కాలు నొప్పి వస్తే అది తనకంటె వేరు కాదని బాధను తాననుభవిసున్నది. ఆ విధముగనే జగత్తునందు ఎవరు బాధపడినప్పటికిని తానే బాధపడుతున్నట్లుగా భావించి వారికి సహాయం చేయాలి. ఆ విధంగా చేస్తూ తనకు తాను సహాయం చేసుకొన్నానని భావించాలి. ఇదంతా నీకు నీవు సహాయం చేసికోవటమే! నీ బాధను నీవు నివారణ చేసికోవడమే! పరులయందు, తనయందున్న దివ్యతత్త్వమొక్కటేననే సత్యాన్ని గుర్తించినప్పుడు ఈ భేద భావములకు అవకాశముండదు. ఇట్టి సమత్వాన్ని బోధించడమే దివ్యత్వంయొక్క ప్రధాన లక్ష్యం.

**మానవజీవితముయొక్క విలువను నిరూపించేది కష్టములే, దుఃఖములే!**

ఎన్ని విన్నప్పటికిని, ఎన్ని చదివినప్పటికిని, ఎన్ని చూసినప్పటికిని మానవత్వం మధ్య మధ్య ఈ విధమైన అల్పత్వానికి గురియవుతుంది. మన అల్పత్వాన్ని నిర్మూలించుకోవాలి. సమత్వాన్ని అభివృద్ధిపరచుకోవాలి. ఈ సమత్వాన్ని పెంపొందించుకొనుటకు ప్రేమతత్త్వం ఒక్కటే ప్రధాన మార్గము. ఒక చిన్న ఉదాహరణము. మానవ జీవితములో అనేక కష్ట నష్టములు, దుఃఖములు, విచారములు సంభవిస్తుంటాయి. ఇవి మానవుని అభివృద్ధికి మార్గము చూపించేవి. కష్టములు, దుఃఖములు, విచారములే లేకుండిన మానవ జీవితము రుచ్యము కాదు. మానవత్వముయొక్క విలువను నిరూపించేది కష్టములు, దుఃఖములే!

హరిశ్చంద్రుడనేక కష్టములకు గురి కావడంచేత, వాటిని ఎదుర్కొనడంచేత అతని కీర్తి జగద్వ్యాప్తమయింది. ప్రహ్లాదుని అతని తండ్రి హిరణ్య కశిపుడెన్ని హింసలకు గురి చేసినప్పటికి, ఎన్ని బాధలు పెట్టినప్పటికి అతడు భక్తి ప్రపత్తులతో ఎదుర్కొనడం వల్ల అతని కీర్తి లోకవ్యాప్తి చెందింది. కాని, కలి ప్రభావంచేత ఈనాడు మానవులలో 'కష్టములు కలుగ కూడదు, కాలు గడప దాటకూడదు, కాసు ఖర్చు కాకూడదు, ముక్తి వచ్చి ఒడిలో పడాలి' అనే భావం ఏర్పడుతున్నది. ఇవి యే విధంగా వచ్చి పడినాయో, ఆ విధంగానే పోతాయి. నిజానికి కష్టములద్వారా లభించినటువంటిదే మనకు సరియైన బలమునందిస్తుంది. 'స్వామీ! మాకెట్టి కష్టములు, నష్టములు, దుఃఖములు రాకుండ ఆశీర్వదించాలి' అని అంటారు. ఇది సరియైన ప్రార్థన కాదు. రావాలి కష్టాలు. వాటిని నీవు ఎదుర్కోవాలి, జయించాలి, సాధించాలి. అలా

sri sathyasai vachanamrutam

సాధించి సాక్షాత్కారాన్ని పొందాలి!

**పిలచి అడుగ చెఱకు పెట్టునా బెల్లంబు**
**పిప్పిగొట్టి రసము పీల్చుకున్న**
**జాతివజ్రమునైన సానబట్టగవలయు**
**గురువు తీర్చుకున్న గుణము సున్న.**

వజ్రాన్ని అనేక కోతలు కోసినప్పుడే మంచి విలువగలిగినదిగా రూపొందుతుంది. ప్రకాశాన్ని పొందుతుంది. ఈ వజ్రానికి కోతలు లేకున్న విలువ అధికము కాదు. చెఱకును పిప్పి పిప్పి చేయకుండ రసము వెలువడదు. చక్కెర తయారు కాదు. మన శరీరమే ఒక చెఱుకు గడ. దీనికి అనేక కష్టములు, నష్టములు, దుఃఖములు కలిగి దానిని పిప్పి పిప్పి చేసినప్పుడు ఆత్మవిశ్వాసమనే రసం మనలో ఆవిర్భవిస్తుంది. అదే "రసోవైసః" ఆ రసమే భగవత్స్వరూపము. ఆ రసం యెక్కడ మనిషియందుంటుంది? "అంగీరసాయనమః" ప్రతి అంగమునందు ఉంటుంది. దీనికి మరో చక్కని ఉదాహరణ. ఒక చెఱకు గడలో మధురమైన రసముంటుంది. కాని, కణుపు దగ్గర కఠినంగా ఉంటుంది. అక్కడే రసమెక్కువగా ఉంటుంది. మన శరీరమనే చెఱకునందు కష్టములు, దుఃఖములు, నష్టములనేటటువంటివి కణుపులు. నిజానికి వాటియందే మనకెక్కువ మధురమైన రసములనే అనుభవాలు లభిస్తాయి. ఈ విధమైన సమత్వాన్ని మనం భావించినప్పుడు ప్రేమతత్త్వమధికమౌతుంది.

**పుణ్యఫలమాశించేవాడు పుణ్యకార్యమాచరించాలి**

ప్రేమను మనము విశ్వసిస్తున్నాము. ఈ ప్రేమ అభివృద్ధి కావాలంటే ఏం చేయాలి? ఇది అందరిలోను ఆవిర్భవించే సందేహం. 'మాకు భగవంతునిపై ప్రేమ దినాదినాభివృద్ధి కావాలి' అని అంటారు. ఇది అభివృద్ధి కావడానికి ఏకైక మార్గం మనం విశ్వసించినదానిని ఆచరణలో పెట్టటమే! అలా పెట్టినప్పుడు అదే అభివృద్ధియవుతుంది. కాని, ఈనాడు మనం ఆచరించడం లేదు. కనుకనే అది తరిగి పోతున్నది.

నాటిన మొక్కకు నిత్యము నీరు పోస్తే కదా, అది పెరుగుతుంది. ఎంత మంచిమొక్కయైనా నాటినప్పుడు నీరు పోయకపోతే అది అభివృద్ధి కాదు. కనుక, ఈ ప్రేమ అనే మొక్కను నీవు



sri sathyasai vachanamrutam

నాటినప్పుడు ప్రేమ జలం దానికి నిత్యం పోస్తుండాలి. అప్పుడే ఈ ప్రేమవృక్షం అభివృద్ధి అవుతుంది. అప్పుడే ప్రేమ ఫలాలన్నీ మనకు లభిస్తాయి. కాని, ఈనాటి మానవుడు ప్రేమను ధారపోసేటువంటి పవిత్ర, పుణ్య కార్యాల నాచరించడం లేదు.

**"పుణ్యశ్చ ఫలమిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవాః**
**న పాప ఫలమిచ్ఛంతి పాపం కుర్వంతి యత్నతః"**

ఇది ఈనాటి దోషము. పుణ్య ఫలం కావాలి, కావాలి అని ప్రతి మానవుడాశిస్తున్నాడు. కాని, పుణ్య కార్యాలు చేయడానికి ముందంజ వేయటం లేదు. పాప ఫలం వద్దు, వద్దు, అని అంటున్నాడు. కాని, పాపకార్యం చేస్తున్నారు. వద్దన్న వాడెందుకు చేయాలి? పాప ఫలమును ఆశించనివాడు పాపకార్యం చేయరాదు. పుణ్య ఫలమాశించేవాడు పుణ్య కార్యమాచరించాలి. ఆచరింపనపుడు ఈ పుణ్య ఫలము మనకు లభ్యం కాదు. అదే విధముగనే భగవంతుని ప్రేమ తనపై ప్రసరించాలి అని అనుకున్నప్పుడు ఆ ప్రేమతత్త్వం నిత్యం నీలోపల అభివృద్ధి అయ్యేటట్లు పుణ్య కార్యాల నాచరించాలి. నిత్యాచరణలో పెట్టకపోతే ప్రేమ యే రీతిగా అభివృద్ధి చెందుతుంది?

**మనోవాక్కాయకర్మల ఏకత్వమే భగవత్సాక్షాత్కారమునకు ప్రధానమైన సాధన**

మానవుడనే పదమునకు విశ్వాసం గలవాడని అర్థం. నమ్మకం కలవాడు. నమ్మిన దానిని ఆచరణలో పెట్టకపోవడంచేతనే నమ్మకం క్షీణించిపోతున్నది. కేవలం బాహ్యమైనటువంటి మంత్రములపైన, యంత్రములపైన, స్వరూపముపైన మన మనస్సు ప్రసరిస్తున్నది. ఒక చిన్న ఉదాహరణము. విక్రమాదిత్యుడు ఒకనొక సమయంలో మారు వేషమును ధరించి, దేశ సంచారం చేస్తున్నాడు. ఒక చోట ఒక వృద్ధ బ్రాహ్మణుడు యజ్ఞమునాచరిస్తున్నాడు. ఎంతకాలంనుండి చేస్తున్నాడో ఏమిటో, ప్రక్కనే యజ్ఞ భస్మము గుట్టలుగా పేరుకుపోయింది. దానిని చూసి విక్రమాదిత్యుడు "స్వామీ! మీరు చేస్తున్న పనియేమి?" అన్నాడు. "నేను అరువది సంవత్సరములనుండి ఈ యజ్ఞాన్ని చేస్తున్నాను నాయనా! ఈ యజ్ఞ భస్మరాసులే యివి" అన్నాడు. "ఈ యజ్ఞాన్ని క్షణమైన వదలకుండ అరవై సంవత్సరాలనుండి చేస్తున్నాను. కాని, యజ్ఞపురుషుని అనుగ్రహానికి నోచుకోలేక, అతనియొక్క స్వరూపముయొక్క సాక్షాత్కారాన్ని

sri sathyasai vachanamrutam

పొందలేకపోతున్నానని బాధపడ్డాడు. ఆ పండితుని చూసి విక్రమాదిత్యుని హృదయం కరిగింది. వెంటనే ధ్యానములో కూర్చున్నాడు విక్రమాదిత్యుడు. చాల కఠినమైన తపస్సు చేసాడు. ఎంతసేపు చేసినప్పటికిని యజ్ఞ పురుషుడు సాక్షాత్కరించలేదు. 'నేను చేసిన సాధనల ఫలితమేమిటి? భగవంతుని అనుగ్రహానికి నోచుకోలేనటువంటి జీవితం నాకెందుకు?' అని తన కత్తిని తీసాడు. 'ఇదేనా బ్రదుకు? నిత్యము తినటము, జీవించటము, దేహాన్ని పెంచుకోవటమేనా? ఇది కాదు. జీవిత పరమావధి దైవాన్ని చూడటమే!' అని "ఓ యజ్ఞపురుషుడా! నాకు నీవు దర్శనమే యివ్వకున్న నా ప్రాణాన్ని నీకర్పిస్తానని" హృదయ పూర్వకంగా ప్రార్థించి కత్తితో వేటు వేసుకోబోయాడు. తక్షణమే యజ్ఞ పురుషుడు ప్రత్యక్షమయి, విక్రమార్కుని చేతనున్న కత్తిని లాక్కున్నాడు. "విక్రమాదిత్యా! ఇది సాహసముకాని, సాధన కాదు" అంటూ "నేనెక్కడున్నాను? – 'అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధం' నీలోనే ఉన్న నన్ను ఒకవైపున సంహరించడానికి పూనుకుంటూ, మరొక వైపున సాక్షాత్కరించమని కోరుకొనేది సాధన లక్షణమా? నేను నీలోనే యున్నాను. ఇది కేవలం ఒక రాజసిక సాహసమే గాని, సాధన కాదు" అన్నాడు. కనుక, ఈ విధమైనటువంటి సాహసాలకు భక్తుడు పూనుకోరాదు. "నన్ను పొందడానికి తగిన మార్గం ప్రేమ మార్గమే! ఈ సాహసం కాదు. ఏది చేసినా, ఏది చూసినా, అంతా దైవమయంగా నీవు భావించాలి. అలా చేసినప్పుడు Work will be transformed into worship. కాని, ఈ బ్రాహ్మణుడు అరవై సంవత్సరములనుండి మంత్రార్థము తెలియకుండ కేవలం శబ్దములనుచ్చరిస్తూ (కృత్రిమంగా) చేస్తున్నాడే తప్ప నిజమైన హృదయ భావంతో నన్ను ఆహ్వానించడం లేదు. 'మనసు మంత్రం పైన- ఆశ నాపైన' ఐనప్పుడు సాక్షాత్కారం ఎలా సాధ్యం? ఎవడు మనసును, వాక్కును, క్రియను నాకర్పితము చేసి నన్ను ఆరాధిస్తాడో, వానికి నేను సాక్షాత్కరిస్తాను. ఇదియే త్రికరణ శుద్ధి. మనో వాక్కాయ కర్మల యేకత్వమే నాకు ప్రధానము" అన్నాడు. ఇది చేయడానికి వానికి శక్తి లేకపోయినప్పుడు నా ఆజ్ఞను శిరసావహించి నేనేది ఆజ్ఞాపిస్తే అది చేయాలి. సందేహానికి అవకాశమివ్వకూడదు. గొంతు కోసుకో అన్నప్పుడు తప్పక కోసుకోవాలి. ఆ ఆజ్ఞాపాలనమే నిన్ను రక్షిస్తుంది" అన్నాడు.

**దివ్యత్వములోని రహస్యాలు చాలా సూక్ష్మంగా ఉంటాయి**

srisathyasaivahamrutam

ప్రహ్లాదుని కుమారుడయిన విరోచనుడు, అంగీరసుని కుమారుడయిన సుధీరుడు ఇరువురు ఒక పందెం వేసుకున్నారు. ఆ పందెంలో ఎవరోడిపోతారో వారు గెలిచిన వానికి ప్రాణం అర్పించాలి. వారిద్దరి మధ్య ప్రహ్లాదుడు న్యాయనిర్ణేత. ఇతను ధర్మమూర్తి. వాదంలో విరోచనుడు ఓడిపోయినట్లుగాను, అంగీరసుని కుమారుడు సుధీరుడు గెలిచినట్లుగాను నిర్ణయించినాడు. అప్పుడు విరోచనుడు కత్తి తీసుకొని తన శిరస్సును వేటు వేసుకోవడానికి పూనుకున్నాడు. చెప్పినట్లు చేయడం వల్ల తక్షణమే సుధీరుని మనస్సు కరగిపోయింది. 'నేడు నీ తండ్రిగారు న్యాయంగా, సత్యంగా, ధర్మంగా నిర్ణయం చేసారు. ఆయన కుమారుడవయిన నీప్రాణాన్ని తీసుకోవడంచేత నీ తండ్రిని బాధపెట్టినవాణ్ణవుతాను. అటువంటి న్యాయమూర్తికి బాధను కలిగించడం నాకిష్టం లేదు.కాబట్టి నీ ప్రాణం నాకక్కర లేద'ని తండ్రికి కుమారుని అప్పగించాడు.

ఇదే విధంగా పరశురామునికి ఆతని తండ్రి ఒక కఠినమైన ఆజ్ఞనిచ్చి చేయమని శాసించాడు. అది యేమి? అంతకుముందు జమదగ్ని భార్య జలము తీసికొనిరావడానికి నదికి వెళ్లినప్పుడు ఒక వ్యక్తిని చూసింది. ఆమె పవిత్రమైన హృదయం కలది. కాని, కుతూహలంతో ఆ పోయెవాడెవరా? యని చూసింది. అతనిని చూసి 'ఆహా! ఎంత అందమైనవాడు' అనుకుంది. ఇంటికి వచ్చేటప్పటికి జమదగ్ని ఆమెను చూసి, తన దివ్యదృష్టితో జరిగిన దానిని గ్రహించి, ఆమె మనసు చలించిందని పరశురాముని పిలిచి తల్లి శిరమును తునుమాడుమని ( ఖండించుమని) శాసించాడు. ఆ సమయంలో ఏ మాత్రంకూడ జంకలేదు, పరశురాముడు. తండ్రి ఆజ్ఞను శిరసావహించి తల్లి గొంతు కోసాడు. అప్పుడు తండ్రి మెచ్చి "పరశురామా! నీకేం కావాలో కోరుకో" అన్నాడు. "తండ్రీ! నా తల్లిని బ్రతికించుమ'ని అన్నాడు. ఇక్కడ తండ్రి ఆజ్ఞను శిరసావహించాడు. కాబట్టి పరశురాముని కోరిక తీరింది. అంతేకాని శిరసావహించకుండా నా కోరిక తీర్చమంటే ఎలా తీరుతుంది?

కనుక, దివ్యత్వంలోని రహస్యాలింత సూక్ష్మంగా ఉంటాయి. కృష్ణ తత్త్వమునందుకూడ ఇటువంటి అంతరార్థాలతో కూడిన ఎన్నో విషయాలున్నాయి. కాని, ప్రజలు తమ తమ భావములను పురస్కరించుకొని అనేక అనర్థములు పెంచి, నానార్థములు కల్పించి, వాటిని విశ్వసించి, యథార్థాన్ని విస్మరించి, అనర్థం కొనితెచ్చుకుంటున్నారు.

srisathyasaivachanamrutam

## ప్రతి మానవుని హృదయకమలమందుండే అష్టదళములకు భగవంతుడే అధిపతి

శ్రీకృష్ణునికి అష్ట మహిషులే (ఎనిమిది మంది ప్రధానమైన రాణులు) కాకుండ పదహారు వేలమంది గోపికలు భార్యలున్నారని అంటారు. దీనిలోని అంతరార్థమేమిటి? వీరు ప్రాపంచికమైన భార్యలు కారు. మానవదేహములో షట్చక్రములున్నాయి. ఈ షట్చక్రములో సహస్రార చక్రం, హృదయ చక్రం చాలా ప్రధానమైనవి. మానవ హృదయమును అష్ట దళ పద్మముతో పోలుస్తారు. అనగా ఈ అష్ట దళములు అష్ట మహిషులన్నమాట! ఈ అష్ట దళములకు అష్టభూములనికూడ ఒక పేరు. ఈ భూమికి నాథుడు భగవంతుడు. ప్రకృతి, పరమాత్మ. ప్రకృతికి Master పరమాత్మ. ఈ అష్టదళములకు నాథుడు భగవంతుడు. కనుక హృదయ పద్మమునకు అష్ట దళములు, అష్ట భూములు కనుకనే దీనికి నాథుడు భగవంతుడు. హృదయమే దేహానికి అతి ప్రధానమైనది మరియు అత్యవసరమైనది. ప్రతి మానవుని హృదయ కమలమందుండే అష్టదళములకు భగవంతుడే అధిపతి. అతనినే 'మాధవ' యన్నారు. 'మా' అనగా లక్ష్మి, మాయ, ప్రకృతి అని అర్థములున్నవి. 'ధవ' యనగా నాథుడు. 'మాధవ' యనగా హృదయానికి నాథుడు. భూమికి నాథుడు. మాయకు నాథుడు. లక్ష్మీనాథుడని అర్థములు. కనుకనే ఈ అష్ట దళములతో కూడిన హృదయమునకు నాథుడు భగవంతుడైన శ్రీకృష్ణుడు.

ఇక సహస్రారము, కడపటి చక్రము. అది వేయి దళములతో కూడినది. దీనినే "సహస్ర శీర్షా పురుషః, సహస్రాక్షః సహస్రపాత్" అని అన్నారు. ఒక్కొక్క దళమునందుకూడ భగవంతుడు షోడశ కళలతో నిండియున్నాడు. ఒక్కొక్క దళమునకు పదునారు కళలున్నాయి కాబట్టి అవి పదునారువేలయినవి. ఇవే 16,000 గోపికలు. గోపికలనగా నేమి? దళములే! 'గో' అనగా శబ్దము, వాక్కు ప్రాణము అని అర్థములున్నవి. ఈ సహస్ర ప్రాణములకు కూడ తానే అధిపతి. కనుకనే కృష్ణునికి పదహారు వేలమంది గోపికలన్నారు. ఈనాడు భాగవతమునందున్న పవిత్రమైన, సూక్ష్మమైన అర్థాన్ని ఎవ్వరూ గుర్తించడానికి ప్రయత్నించడం లేదు. 'కృష్ణునికే పదహారు వేలమంది యున్నప్పుడు నాకు పదహారుమందైనా ఎందుకుండకూడదు?' ఈ విధమైన భావము పిల్లల్లోకూడ ప్రారంభమవుతుంది. ఇది కాదు, ప్రధానమైనది. పదహారు కళలు మనలో వికసించాలి. భగవదాజ్ఞను శిరసావహించినప్పుడే ఆ పదహారు కళలు మనలో

srisathyasaivachanamrutam

దేదీప్యమానంగా వెలుగులు జిమ్ముతాయి.

మూలాధారమునుండి ప్రారంభమైన కుండలినీ శక్తి సహస్రారము లోనికి పోయి వికసిస్తుంది. దానికి ప్రాణ వాయువే ప్రధానమైనది. ఆ ప్రాణమే ప్రేమ. ఈ ప్రేమ, ప్రాణ వాయువుగా మూలాధారంలో ప్రారంభమై సహస్రారంలో విచ్చుకోవాలి. చాల మంది ఈ ఆధునిక యుగంలో వైజ్ఞానికంగా దీనిలోనున్న అర్ధ నారీశ్వర తత్త్వాన్ని గుర్తించాలి. దీనిని ఏ విజ్ఞాన శాస్త్రజ్ఞుడు వివరించి చెప్పడం లేదు. పూర్వీకులు చెబుతున్న అర్ధ నారీశ్వర తత్త్వానికి నేటి వైజ్ఞానికులు ఉపయోగపెడుతున్న పదమునకు ఎంత సన్నిహిత సంబంధమున్నదో యోచించుకోవచ్చును.

**ప్రపంచములో ప్రతి ఒక్క పదార్థము అణుస్వరూపమే!**

ఇదే విధంగా మరెన్నో ఉన్నాయి. పదార్థము అణువులతోకూడి నిర్మితమైయుంటుంది. ఈ ప్రతి అణువునందు ప్రోటానులు, ఎలెక్ట్రానులు అనే రెండు శక్తులున్నాయి. ఎలెక్ట్రానులనేవి ఋణ ధృవములవంటివి. ప్రోటానులు ధన ధృవాలు. ఎలెక్ట్రానులలో నుండేది స్త్రీ తత్త్వము. ప్రోటానులలో ఉండేది పురుష (మగ) తత్త్వము. అర్ధ నారీశ్వర యనగా అర్ధం స్త్రీ, అర్ధం పురుషుడని అర్థము. ఎలెక్ట్రానులనబడే వంతా స్త్రీ తత్త్వము. ప్రోటానులనేవి పురుష తత్త్వము. ఈ రెండూ చేరి అణువుగా రూపొందుతున్నాయి. ప్రపంచంలో ప్రతి పదార్థము అణుస్వరూపమే! కాబట్టి జగత్తంతాకూడ అర్ధ నారీశ్వర తత్త్వంగా మన పూర్వీకులు నిర్ణయించారు.

ఇదే విధంగా కొన్ని సూక్ష్మమైన విషయాలను సైన్స్ ప్రకారం వివేచిస్తే మన భారతీయ పర్వ దినాల్లో లేక కల్యాణ సమయాల్లో లేక మరే శుభ కార్యాలు నిర్వహించేటప్పుడైనా ద్వారాలకు మామిడాకుల పచ్చని తోరణాలు కడుతుంటారు. వాటితోపాటు అరటి స్తంభాలుకూడ కడుతుంటారు. దీని అంతరార్థమేమిటి? 'భారతీయులు మూర్ఖంగా, పిచ్చి పిచ్చివన్నీ తగిలిస్తుంటారు. ఇవన్నీ తొందరగా వాడిపోతుంటాయి. వీటికన్న ఎప్పుడు తాజాగా కనిపించే ప్లాస్టిక్ తోరణాలు తగిలిస్తే మంచిది గదా!' అంటుంటారు. ఇంతకూ చెట్టులోనున్న కొమ్మలనెందుకు కోయాలి? వీటిని కట్టుకొంటే సరిపోతుంది కదా! అని ఈనాటి మహా మేధావులు, వైజ్ఞానికులంటుంటారు.

మన పూర్వీకులు చాల మేధావులు. విజ్ఞాన శాస్త్ర రహస్యాలు తెలిసినవారు. దివ్యమైన

srisathyasaivachanamrutam

భావాలు అంతర్గర్భితంగా వారు చేసే పనుల్లో నిండియుంటాయి. ఎక్కడైనా పదిమంది చేరినప్పుడు వాతావరణం కలుషితమౌతుంది. వచ్చినవారు విడిచే గాలివల్ల విషవాయువులు అంతటా నిండుకుంటాయి. కార్బన్‌డయాక్సైడ్ ఆ వాతావరణంలో వ్యాపిస్తుంది. ఎందుకంటే మనం విడిచేది కార్బన్‌డయాక్సైడే కదా! అప్పుడు ఈ పచ్చని ఆకులు విషవాయువులను పీల్చుకొని, తమయందున్న ప్రాణ వాయువును వదలుతాయి. ఈ విధంగా గుంపులు కూడినప్పుడు విషవాయువులు వ్యాపించకుండ ఈ మామిడి తోరణాలు, అరటి బోదెలు మనకుపయోగపడుతాయి.

ఈనాడు ఆధునికులు కట్టుకొనే గృహాలలో, పెద్ద పెద్ద హాల్స్‌నిర్మించుకొని, వాటికి పెద్ద పెద్ద విండోలు (కిటికీలు) పెట్టుకొంటున్నారు. పూర్వపు గృహాలు చిన్న చిన్న ద్వారాలతో నుండేవి. అటువంటి ఇండ్లలో పెళ్ళిళ్లని ఒక ఇరవైమంది చేరితే వారు విడిచిన గాలివల్ల వాతావరణమంతా విషమయమౌతుంది. కాబట్టి దానిని పీల్చుకోవడానికి, ప్రాణ వాయువునందించడానికి ఇలా పచ్చని తోరణాలు కట్టేవారు. అవి ప్రాణ వాయువుని వదలి ఆరోగ్యాన్ని సంరక్షించేవి. ఇది మూర్ఖత్వమా?

పూర్వం పేడను నీళ్ళలో కలిపి పర్వ దినములయందు, పండుగలయందు ఇంటిముందు చల్లుకోవడం వాడుక. ఈనాడు 'ఇదంతా ఏమిటిరా? ఈ పేడనంతా ఇలా చల్లుతున్నారు. మంచి పాలరాళ్లు, మొజాయిక్ స్టోన్స్ పఱచుకొని చక్కగా శుభ్రంగా పెట్టుకోవచ్చుగదా!' అనుకుంటారు. కాదు కాదు. ఈ పేడలో యాంటీ బయాటిక్స్ అనగా సూక్ష్మక్రిములను చంపే శక్తి యుంటుంది. దానిని చల్లినప్పుడు చుట్టునున్న విష క్రిములంతా నాశనమయ్యేవి. అందువల్ల మనుషులు ఆరోగ్యంగా ఉండేవారు. దురదృష్టవశాత్తు ఈనాడు ఏ సైంటిస్ట్ పేడపైన పరిశోధనలు చేయడం లేదు. చేస్తే వారికి దీనిలోని విషయాలు తెలుస్తాయి. ఈ విధంగా ఆనాటి సమాజాన్ని ఆరోగ్యవంతంగా, పవిత్రంగా ఇటువంటి ఆచారాలతో సురక్షితంగా ఉంచుకున్నారు.

ఇంతే కాకుండా పూర్వం ఆడవారంతా పసుపును వాడేవారు. ద్వారాలకు, గడపలకుకూడ పసుపు రాసేవారు. దానిపైన కుంకుమ బొట్లు పెట్టేవారు. ఈ పసుపు యాంటీ సెప్టిక్‌గా పనిచేస్తుంది. బయటినుండి ఏ క్రిమి కీటకాదులు లోనికి రాకుండ కాపాడుకొనేవారు. కాని

sri sathyasaivachanamrutam

ఈనాడు పసుపునెందుకు వాడాలి? తలుపులకు, గడపలకు పసుపు రంగు పూస్తే సరిపోతుంది గదా! అని అంటున్నారు. కాని, అవి క్రిములను నాశనం చేయలేవు కదా!

**ప్రాచీనకాలంలో ఆరోగ్యము, ఆనందము ఈ రెండే జీవిత లక్ష్యముగా ఉండేవి**

మన పూర్వీకులు ప్రతి చిన్న విషయమునందు, చేసే ప్రతి పనియందు ఏదో ప్రయోజనం, అంతరార్థము, పవిత్రత ఉండేవి. మన భారతీయులు పూర్వం కుంకుమ, పసుపు రాసుకొనే (పూసుకొనే) వారు. ఒకప్పుడు దీనిపైన నేనొక పాటకూడ వ్రాసాను:

**ఫేస్ పౌడర్ అవతరించి మోసగించె, పసుపు పోయె**
**ఏమి కాలము వచ్చెనో ఓ జనులార!**
**ఏమి కాలము వచ్చెనో**
**కాసుల దండలు పోయె**
**మోసగించే చైనులొచ్చె**
**ఏమి కాలము వచ్చెనో జనులార!**
**ఏమి కాలము వచ్చెనో!**

ఆడవారు పసుపు పూసుకుంటే ముఖమంతా సువర్ణమయంగా మారిపోయేది. అక్కడ ఏ మాత్రం వెంట్రుకలుకూడ ఉండేవి కావు. అంతే కాకుండ ఆ పసుపు, కుంకుమల శక్తి సామర్థ్యాలెటువంటివంటె అవి anti septic గా ఉండి ముక్కుల్లోకి, నోట్లోకి ఎటువంటి క్రిములు ప్రవేశించకుండ తోడ్పడేవి. అవి వాడనందువల్లనే ఈనాడు పరిస్థితులు మారిపోయి ఇస్నోఫీలియా, ఆస్మా, ఉబ్బసము ఇలాంటి రోగాలన్ని వస్తున్నాయి. క్రిములంతా లోనికి ప్రవేశిస్తున్నాయి.

ఆనాడు ఆరోగ్యము, ఆనందములు రెండే జీవిత లక్ష్యాలుగా ఉండేవి. ఆరోగ్యముండినప్పుడే ఆనందం ప్రాప్తిస్తుంది. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే, భారతీయ సంస్కృతిలోని ఎన్నో సంప్రదాయాలు, ఆచారాలు నిత్య జీవితంలో మనం చేసే కార్యక్రమాలన్నిటియందు ఉపకారకాలే గాని, అపకారకాలు కావు.

srisathyasai vachanamrutam

**మానవదేహము నవరంధ్రభూయిష్టమైనది; దీనిలో నిరంతరము భగవన్నామమనే శ్వాస జరుగుతుండాలి**

ఆనాడు కృష్ణుని చేతనుండు నవద్వారములు గల వేణు నాదము దేహ సంబంధమైన రోగములను, మనస్సంబంధమైన వ్యాధులను నివారించింది. దీని యంతరార్థము మానవుని దేహమే నవరంధ్ర భూయిష్ఠమని, దీనిలో భగవన్నామమనే శ్వాస జరుగుతుండాలని తెలియజేస్తుంది. అంతేగాక ఒక్కొక్క రంధ్రమునకూడ భగవంతుని హస్త స్పర్శ కావాలి. ఆ స్పర్శచేతనే "స్పర్శనం పాప నాశనం" అని నానుడి యేర్పడింది. అందువల్లనే గోపికలు ఇలా చెబుతూ వచ్చారు.

**పాట పాడుమా కృష్ణా! పలుకు తేనె లొలుకునటుల**
**మాటలాడుమా ముకుంద! మనసు తీరగా**
**వేద సారమంత దీసినాద బ్రహ్మముగను మార్చి**
**వేణువందు తిరగబోసిగాన రూపముగను మార్చి**
**పాట పాడుమా కృష్ణ! పలుకు తేనె లొలుకునటుల**
**మాటలాడుమా ముకుంద!మనసు తీరగా**

"కృష్ణా! మా దేహములనే నీ వేణువుగా మార్చుకో! నీ ఉచ్ఛ్వాస నిశ్వాసములు ఈ దేహంలోపల స్వేచ్ఛగా సంచరింపజేయుము. నీ యొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసములే వేదసారము. ఈ వేదసారమును దేహంలో చేర్చటంచేత గానసారంగా రూపొందుతుంది. అట్టి గానాన్ని వినిపించు" అన్నారు.

ఏ వసంత కోకిల గానమో, ఎం.యస్. సుబ్బలక్ష్మి గానమో, పి. లీల గానమో కాదు. వేదగానమును వినిపించమన్నారు. మన దేహమొక వేణువు. ఈ వేణువునకు నవ రంధ్రములున్నట్లుగా దేహమునకుకూడ నవరంధ్రములున్నాయి. ఇందులో భగవన్నామమనేది సారము. ఇది నఖశిఖ పర్యంతముకూడ సంచరిస్తుండాలి. భగవంతునియొక్క స్పర్శ అన్నింటియందుకూడ ఉండాలి. కనుక, సర్వాంగములుకూడ భగవంతుని సేవయందే అర్పితము గావాలి. ఇదే "సర్వ కర్మ భగవత్ప్రీత్యర్థం" అన్నారు.

srisathyasaivachanamrutam

## భగవంతుని జీవిత చరిత్రయే గోపికల జీవిత చరిత్ర

మన విశ్వ విద్యాలయ ఉప కులపతి (వైస్ ఛాన్సలర్) 'సంపూర్ణ శరణాగతి' అని అన్నారు. ఏకత్వాన్ని భావించడమే శరణాగతి. 'నీవు వేరు - నేను వేరు' అనేభావం ఉండకూడదు. 'నీవులేకపోతే నేను లేను,' ఇదే గోపికలు చెప్పిన పాటలోని అంతరార్థము:

**నిలువ నీడలేని బ్రతుకు నీ కొఱకని మోయుదాన**
**నిలువదురా! నా మనసు నీ నగవులు దూరమైన**
**కలలోనైనా కనులకు కానగ రారా! కృష్ణా!**
**నిను విడిచి నే నిలువ లేనురా!**
**కానగ రారా కృష్ణా॥ కను ॥**

నీవెక్కడున్నా మా కనుపాపగానే యున్నావు. మా కనుపాపగా ఉండి జగత్తును వీక్షిస్తున్నావు. ఇక నీ ప్రేమను చూస్తామా అంటే

**కనుపాపవు మాటకు**
**పసిపాపవు మనసుకు**
**నిను విడిచి నే అర నిముషము**
**నిలువగలేరా కృష్ణా!**
**కానగరావా!**

గోపికలు కోరిన కోరికలన్నీ బాగా యోచన చేస్తే పవిత్రంగా, ఎన్నో అంతరార్థాలతో కూడియున్నాయి. వాళ్ళని హిస్టీరియా రోగులైన లేడీస్‌గా భావించరాదు. వారు 'హిస్టరీ లేడీస్' కాని, 'హిస్టీరియా లేడీస్' కాదు.(పిచ్చి ముదిరిన ముదితలు కాదు, చరితార్థులైన వనితలు) వారి జీవిత చరిత్రమెవరి జీవిత చరిత్రము? అది భగవంతుని జీవిత చరిత్రమే! హిజ్ స్టోరీ (అతని కథ). గోపికలంతా నిరంతరము అతని కథనే గానం చేసారు. మీలో చాలమంది కొత్త పిల్లలు వచ్చి చేరియుంటారు. ఈ విషయాలు తెలుసుకోండి.

sri sathyasai vachanamrutam

ఆనాటి ప్రాచీన సంప్రదాయమును పురస్కరించుకొని వ్రేపల్లెలోని గుడిసెవాసులంతా యశోద యింటినుండి దీపమును అంటించుకొని వచ్చేవారు. 'పెద్దింటివారి జ్యోతిని మన యింటికి తెచ్చుకుంటే మనముకూడ పెద్దింటివారమౌతాము, వారివలె పవిత్రులమౌతామ'నే విశ్వాసం ఆనాడుండేది. ఇప్పుడుకూడ కొన్ని పల్లెలలో ఇంటిముందు ఒక చిన్న కిటికీలా పెట్టుకొని అందులో ఒక దీపాన్ని వెలిగించుకుంటూ ఉంటారు, సాయంకాలం పూట. ఆ వ్రేపల్లెకు కొత్తగా వచ్చింది ఒక కోడలు. ఆ రోజు ఆమె వంతు. యశోద యింటికి పోయి దీపం అంటించుకోవాలి. మనసులో: 'అయ్యో! నేను ఎన్ని దినములనుండి కృష్ణుణ్ణి చూడాలనుకుంటున్నాను. ఇంతవరకు నేనెప్పుడు కృష్ణుణ్ణి చూడలేకపోయాను. ఇప్పుడు అవకాశం లభించింది. అక్కడెక్కడన్నా కృష్ణుడు కనిపిస్తాడేమో!' అని చింతిస్తూ వస్తున్నది. ఆ గోపిక పేరు సుగుణ. సుగుణ నందుని ఇంటికి వెళ్ళి దీపం ముట్టించుకుంటూంటే ఆ దీపంలో ఆమెకు కృష్ణుడు కనిపించాడు, నిరంతర కృష్ణచింతన చేస్తూండడంవలన, ఆమె తనను తాను మరచిపోయి ఆ దీపాన్నే చూస్తూ నిలబడింది. తన చేయి కాలిపోతూంటే ఏమాత్రం పట్టించుకోకుండా ఆనందంగా ఆ దీపంవైపే చూస్తూ ఉండిపోయింది. దీపం ముట్టించుకోవడానికి వెళ్ళిన ఇతర స్త్రీలు, బాలికలు ఈ దృశ్యం చూసి ఆశ్చర్యపోయారు.

**మన సుగుణకు కనిపించెనట**
**నందుని ఇంట గోపాలుడంట**
**దీపాన కనిపించెనంట......**

అని పాట పాడుకుంటూ వాళ్ళు ఆనందంగా డాన్సు చేయడం ప్రారంభించారు.

'కృష్ణుడు నావాడు, నావాడు' అనుకోవడం అహంకారాన్ని పెంచుకోవడమే! ద్వారకావాసులు అట్టి అహంకారముతో నిండిపోయారు. కాని, గోపికలు అట్లా చెప్పుకోలేదు. 'మేము నీవారము' అన్నారు. ఇది శరణాగతుల లక్షణము.

**(తేదీ 02-09-1992న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam